PRGI No. APTEL/2010/31893

# కొత్త స్వరం

తెలుగు దిన పత్రిక

మంగళవారం, జూన్ 9, 2026

TG & AP

సంపుటి : 16 (Vallume : 16) | సంచిక : 5 (Issue: 5) | పేజీలు : 4 (Pages : 4) |

వెల : రూ 2.00/- (Rs : 2.00/-)



## విశాఖ స్టీల్ ప్లాంటులో ఘోర ప్రమాదం

### 8 మంది కార్మికులు సజీవ దహనం

**విశాఖపట్నం, జూన్ 8 (కొత్త స్వరం):** విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో సోమవారం జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు సజీవ దహనమయ్యారు. మరికొందరు తీవ్రంగా గాయపడగా, వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2 విభాగంలో హాట్ మెటల్‌తో ఉన్న ల్యాడిల్స్‌ను తరలిస్తుండగా అవి ఒక్కసారిగా కుప్పకూలాయి. దీంతో మరుగుతున్న ఉక్కు ద్రవం కింద పనిచేస్తున్న కార్మికులపై పడటంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, ప్లాంటు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ ప్రారంభించగా, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. స్టీల్ ప్లాంటులో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.

## టూరిజంకు కొత్త రూట్ మ్యాప్

**తొలి దశలో 8 ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధి**

**ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానాలే లక్ష్యం: మంత్రి జూపల్లి కృష్ణారావు**

5



# రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ గుజరాత్‌కు గులాంగిరి: సీఎం రేవంత్

- మెట్రో, మూసీ ప్రక్షాళనకు కేంద్రం సహకరించడం లేదని విమర్శ
- కిషన్ రెడ్డి, బండి సంజయ్‌పై ఘాటు వ్యాఖ్యలు
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవనానికి శంకుస్థాపన
- రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు అసెంబ్లీలో చర్చకు సవాల్

**హైదరాబాద్, జూన్ 8 (కొత్తస్వరం) :** రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ గుజరాత్‌కు ఇంకెన్నాళ్లు గులాంగిరి చేస్తారని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తెలంగాణ ముఖ్యమంత్రి Revanth Reddy తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో రైలు విస్తరణ, మూసీ ప్రక్షాళన, హైదరాబాద్‌కు అదనపు తాగునీటి వనరుల విషయంలో కేంద్రం సహకరించడం లేదని విమర్శించారు. సోమవారం మియాపూర్‌లో పర్యటించిన ముఖ్యమంత్రి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, మొత్తం రూ.1,674.74 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక సభలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌ను దేశంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న సీఎం, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా నగరాలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి పాఠాలు నేర్చుకుంటున్నామని అన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని, అమెరికా సిలికాన్ వ్యాలీతో పోటీపడే స్థాయిలో సైబరాబాద్ అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీజేపీకి చెందిన పలువురు ఎంపీలు ఉన్నప్పటికీ, మెట్రో ప్రాజెక్టు విస్తరణకు, మూసీ నది ప్రక్షాళ



నకు కేంద్రం నుంచి అనుమతులు, నిధులు తీసుకురాలేదని ప్రశ్నించారు. సబర్మతి నది అభివృద్ధిని గొప్పగా చెప్పుకునే బీజేపీ నేతలు మూసీ ప్రక్షాళనకు ఎందుకు అడ్డుపడుతున్నారని నిలదీశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, 12 ఏళ్ల కేంద్ర పాలనలో బీజేపీ చేసిన పనులపై అసెంబ్లీలో చర్చకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు సీఎం సవాల్ విసిరారు. రాష్ట్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం రాజీపడబోదని స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం..**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టనున్న ప్రధాన పనుల్లో:

- రూ.161 కోట్లతో కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణం
- రూ.530 కోట్లతో మియాపూర్ ఫ్లైఓవర్
- రూ.308 కోట్లతో శేరిలింగంపల్లి ఆర్వోబీ
- రూ.65.53 కోట్లతో బాచుపల్లి ఫ్లైఓవర్ ప్రారంభం
- రూ.229 కోట్లతో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ల అభివృద్ధి
- రూ.110 కోట్లతో పైప్‌లైన్ రోడ్డు నిర్మాణం
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం
- రూ.14.40 కోట్లతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణం.

వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి Duddilla Sridhar Babu, ఎంపీలు Vem Narender Reddy, Anil Kumar Yadav, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బిర్యానీలో చచ్చిన పురుగు

## వినియోగదారుడికి 10 ప్లేట్ల బిర్యానీ ఫ్రీ!

- పుదుచ్చేరి వినియోగదారుల కమిషన్ సంచలన తీర్పు
- రూ.13 వేల పరిహారం చెల్లించాలని రెస్టారెంట్‌కు ఆదేశం
- సేవల్లో లోపంగా పరిగణించిన కమిషన్
- ఐదు ఆదివారాల్లో 10 ప్లేట్ల చికెన్ బిర్యానీ అందజేయాలి
- బిర్యానీలో పురుగు ఉన్నట్లు వీడియో ఆధారాలతో నిర్ధారణ



**పుదుచ్చేరి, జూన్ 8 (కొత్తస్వరం) :** బిర్యానీలో చచ్చిన పురుగు కనిపించిన ఘటనలో పుదుచ్చేరి జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ వినూత్న తీర్పు వెలువరించింది. బాధిత వినియోగదారుడికి రూ.13 వేల పరిహారం చెల్లించడంతో పాటు, 10 ప్లేట్ల హైదరాబాదీ చికెన్ బిర్యానీని ఉచితంగా అందించాలని సంబంధిత రెస్టారెంట్‌ను ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. 2025 డిసెంబర్ 8న పి. సుందరకుమార మణికందన్ తన స్నేహితుడితో కలిసి పుదుచ్చేరిలోని బిర్యాని & Co రెస్టారెంట్‌కు వెళ్లాడు. అక్కడ ఆర్డర్ చేసిన చికెన్ బిర్యానీలో చనిపోయిన పురుగు కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యాడు. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను సేకరించి రెస్టారెంట్ యాజమాన్యానికి ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో వినియోగదారుల కమిషన్‌ను

(మిగతా 2లో..)

## సంక్షేమ రాజ్య నిర్మాణమే లక్ష్యం

**భట్టి విక్రమార్క**

- రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ – రూ.25 కోట్లతో ఎస్సీ హాస్టల్ ఆధునికీకరణ
- ఉద్యోగార్థులకు ఉచిత డిజిటల్ కోచింగ్ అందిస్తాం

5





## పేదల సొంతింటి కల సాకారం..

**576 టిడ్కో గృహాల పంపిణీ**

- లబ్ధిదారులు వెంటనే గృహాల్లో చేరాలని మంత్రి టీజీ భరత్ పిలుపు
- ఇప్పటికే 2,500 ఇళ్లు పంపిణీ.. మరో 576 గృహాల అప్పగింత
- నీరు, రోడ్లు, భద్రతతో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు హామీ
- భవిష్యత్తులో 50 వేల జనాభాతో అభివృద్ధి చెందనున్న టిడ్కో టౌన్
- పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారుల వెల్లడి

2

## భారత్‌పై నిఘా..

**16 నెలల్లో 6 ఉపగ్రహాలు ప్రయోగించిన పాకిస్థాన్**

**న్యూఢిల్లీ, జూన్ 8 (కొత్త స్వరం):** భారత భూభాగాలపై, ముఖ్యంగా జమ్మూకశ్మీర్ ప్రాంతంపై నిఘా కోసం పాకిస్థాన్ తన అంతరిక్ష సామర్థ్యాన్ని వేగంగా విస్తరిస్తోంది. గత 16 నెలల్లో ఏకంగా ఆరు ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహాలను ప్రయోగించినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి. చైనా సహకారంతో పాక్ అంతరిక్ష సంస్థ సుపార్కో ఈ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు సమాచారం. వీటిలో కొన్ని ఉపగ్రహాలు భారత భూభాగాలను తరచూ చిత్రీకరించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి పౌర అవసరాల కోసం అని పాకిస్థాన్ చెబుతున్నప్పటికీ, సైనిక కదలికలపై నిఘా ప్రధాన లక్ష్యంగా ఉన్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత్, పాకిస్థాన్, కశ్మీర్ ప్రాంతాలను తరచూ పర్యవేక్షించేలా ప్రత్యేక కక్ష్యలో ఒక ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టినట్లు వెల్లడైంది. ఇదే సమయంలో చైనా–పాకిస్థాన్ సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్ కూడా 'స్పేస్ బేస్డ్ సర్వైలెన్స్ ఫేజ్-III' కింద రూ.27 వేల కోట్ల వ్యయంతో 52 ఉపగ్రహాల కూటమిని ఏర్పాటు చేసే ప్రణాళికను అమలు చేస్తోంది. 2025–2029 మధ్య ఈ ఉపగ్రహాలను ప్రయోగించి సరిహద్దు ప్రాంతాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయనుంది.



## మరో రెండు మూడు రోజుల్లో.. తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు

- జూన్ 10-12 మధ్య రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం
- అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో తుపాను ఆవర్తనాల ప్రభావం
- రుతుపవనాల రాకతో రైతులకు ఊరట
- 11వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తార వర్షాల సూచన
- ఈ ఏడాది దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం

2



## రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ

- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ ఏర్పాట్లు
- 25 వేల మందికి పైగా భక్తులు ఇప్పటికే హైదరాబాద్‌కు చేరిక
- వెయ్యి మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత
- ట్రాఫిక్ మళ్లింపులు, ఐదు అంబులెన్సుల ఏర్పాటు
- పుకార్లు నమ్మొద్దు.. అందరికీ సరిపడా ప్రసాదం: సజ్జనార్

2

కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
https://kothaswaram.com

మంగళవారం, జూన్ 9, 2026

# భూ హక్కుల రక్షణే లక్ష్యం




## రైతులకు రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు: సీఎం చంద్రబాబు

**పశ్చిమగోదావరి(ఆచంట), జూన్ 8 (కొత్తస్వరం) :**

పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాంతంలో నిర్వహించిన 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళన, రైతుల హక్కుల పరిరక్షణ, వ్యవసాయాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. గత పాలకుల హయాంలో భూ రికార్డులు గందరగోళానికి గురయ్యాయని, రైతుల భూముల విషయంలో అనేక సమస్యలు సృష్టించారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసి భూ యజమానుల హక్కులను రక్షించామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6,688 గ్రామాల్లో రీ–సర్వే పూర్తి చేసి 26.46 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశామని, మరో 62.32 లక్షల పాస్ పుస్తకాలను త్వరలో అందజేస్తామని వెల్లడించారు. కరెన్సీ నోట్ల తరహాలో భద్రతా లక్షణాలతో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. భూమి లావాదేవీలను పారదర్శకంగా మార్చేందుకు బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ విధానాలను అమలు చేస్తున్నామని, వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం కూడా కల్పించినట్లు వివరించారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేస్తూ తక్కువ స్టాంప్ డ్యూటీతో సేవలు అందిస్తున్నామని చెప్పారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న సీఎం, 'అన్నదాత సుఖీభవ' పథకం కింద 46 లక్షల మంది రైతులకు రూ.8,985 కోట్లు జమ చేశామని తెలిపారు. కేంద్ర సహాయంతో కలిపి ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని వెల్లడించారు. ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని, దాణా ధరల నియంత్రణ కోసం చర్యలు కోరామని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా రంగాలకు మరింత ప్రాధాన్యం ఇస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండేళ్లుగా కొనసాగుతున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకు సాగుతోందని సీఎం చెప్పారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తుండటంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, డీఎస్సీ ద్వారా దాదాపు 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు వెల్లడించారు. ప్రజల భూ హక్కుల పరిరక్షణతో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి, సంక్షేమ రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం..

## 576 టిడ్కో గృహాల పంపిణీ

**లబ్ధిదారులు వెంటనే గృహాల్లో చేరాలని మంత్రి టీజీ భరత్ పిలుపు**

**ఇప్పటికే 2,500 ఇళ్లు పంపిణీ.. మరో 576 గృహాల అప్పగింత**

**నీరు, రోడ్లు, భద్రతతో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు హామీ**

**భవిష్యత్తులో 50 వేల జనాభాతో అభివృద్ధి చెందనున్న టిడ్కో టౌన్**

**పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారుల వెల్లడి**



**కర్నూలు, జూన్ 8 (కొత్తస్వరం) :**

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ గుప్త పేర్కొన్నారు. కర్నూలు నగర సమీపంలోని జగన్నాథగట్టు టిడ్కో గృహ సముదాయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 576 గృహాలను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదలకు సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమమని తెలిపారు. గతంలో ప్రారంభమైన టిడ్కో గృహాల నిర్మాణం మధ్యలో నిలిచిపోయినా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేగవంతం చేసి ఇప్పటికే 2,500 గృహాలను పంపిణీ చేశామని చెప్పారు. ప్రస్తుతం మరో 576 గృహాలను లబ్ధిదారులకు అందజేస్తున్నామని వెల్లడించారు. గృహ సముదాయంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఓవర్‌హెడ్ ట్యాంకు ఏర్పాటు చేయనున్నట్లు, పోలీసు అవుట్‌పోస్ట్ కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమీపంలో ఏర్పాటు కానున్న ఎంఎస్‌ఎంఈ పారిశ్రామిక సముదాయం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా పదివేల గృహాల్లో ఇప్పటికే 2,500 ఇళ్లను పంపిణీ చేశామని, ఈరోజు మరో 576 గృహాలను అందజేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు వెంటనే గృహాల్లో నివాసం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ గృహ సముదాయం భవిష్యత్తులో 40 నుంచి 50 వేల జనాభా నివసించే పెద్ద టౌన్‌గా అభివృద్ధి చెందే అవకాశముందని కలెక్టర్ పేర్కొన్నారు. రెండు నెలల్లో తాగునీటి పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికి నీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. అలాగే ఫెయిర్ ప్రైస్ షాప్, అంగన్‌వాడీ కేంద్రం, బస్సు సౌకర్యం వంటి సేవలను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, టిడ్కో గృహాల పంపిణీ విజయవంతంగా కొనసాగడం వెనుక మంత్రి టీజీ భరత్ ప్రత్యేక చొరవ, నిరంతర పర్యవేక్షణ ప్రధాన కారణమన్నారు. కర్నూలు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ఓర్వకల్ పారిశ్రామిక ప్రాంతంలో భారీ పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటు కావడం ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేష్, టిడ్కో అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా ఇంటి తాళాలు, స్వాధీన పత్రాలు అందజేశారు.

# రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ

**నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ ఏర్పాట్లు**

**25 వేల మందికి పైగా భక్తులు ఇప్పటికే హైదరాబాద్‌కు చేరిక**

**వెయ్యి మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత**

**ట్రాఫిక్ మళ్లింపులు, ఐదు అంబులెన్సుల ఏర్పాటు**

**పుకార్లు నమ్మొద్దు.. అందరికీ సరిపడా ప్రసాదం: సజ్జనార్**

**హైదరాబాద్, జూన్ 8 (కొత్తస్వరం) :**

హైదరాబాద్‌లో ప్రతి ఏడాది నిర్వహించే చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు V. C. Sajjanar తెలిపారు. నాంపల్లిలోని Hyderabad Exhibition Grounds వద్ద సోమవారం రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుందని వెల్లడించారు. కార్యక్రమ ఏర్పాట్లను మంత్రులు Ponnam Prabhakar, Vakiti Srihari, Mohammed Azharuddin పరిశీలించినట్లు తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ఇప్పటికే సుమారు 25 వేల మంది భక్తులు హైదరాబాద్‌కు చేరుకున్నారని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. భద్రతా చర్యలను Chandramohan పర్యవేక్షిస్తారని వెల్లడించారు. నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని, అత్యవసర పరిస్థితుల కోసం ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వివిధ భాషల్లో భక్తులకు సూచనలు అందిస్తున్నామని, షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం నిఘా ఉంచనున్నారని చెప్పారు. అందరికీ సరిపడా చేప ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సజ్జనార్ స్పష్టం చేశారు. రద్దీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని స్థానికులు అవసరమైతే మరుసటి రోజు కూడా వచ్చి ప్రసాదం తీసుకోవచ్చని సూచించారు. కార్యక్రమానికి వచ్చే భక్తులు పోలీసులకు సహకరించి ప్రశాంతంగా ప్రసాదం స్వీకరించాలని కోరారు.

# బ్యాగ్ లిఫ్టింగ్ ముఠా అరెస్ట్..

**బంగారం, వెండి ఆభరణాల స్వాధీనం**

**హైదరాబాద్ బస్సు ఎక్కించే పేరుతో మహిళలను మోసం చేసిన నలుగురు దొంగలు**

**హర్యానాకు చెందిన అంతర్రాష్ట్ర నేరగాళ్ల ముఠా పట్టివేత**

**సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుల గుర్తింపు**

**ప్రధాన నిందితుడు సందీప్‌పై 30కి పైగా కేసులు నమోదు**

**దొంగిలించిన ఆభరణాల స్వాధీనం.. నిందితులు రిమాండ్‌కు**

**కర్నూలు, జూన్ 8 (కొత్తస్వరం) :**

కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో బ్యాగ్ లిఫ్టింగ్‌కు పాల్పడిన హర్యానా రాష్ట్రానికి చెందిన నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఏడాది మే 14న కర్నూలుకు చెందిన తల్లి–కూతుళ్లు సావిత్రమ్మ, శ్రీలత హైదరాబాద్ వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్నారు. ఈ సమయంలో నలుగురు వ్యక్తులు సహాయం చేస్తున్నట్లు నటిస్తూ వారి లగేజీని బస్సులో ఎక్కించే క్రమంలో జిప్ సూట్‌కేస్‌ను తెరిచి అందులో ఉన్న సుమారు ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి ఆభరణాలను అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. అనుమానితులను గుర్తించి విచారణ జరపగా, వారు హర్యానా రాష్ట్రంలోని భీవాని జిల్లాకు చెందిన వారిగా తేలింది. అరెస్టైన నిందితులు సందీప్, సునీల్ కుమార్, రాజేష్, ప్రవీణ్‌లుగా పోలీసులు గుర్తించారు. వీరిలో ప్రధాన నిందితుడు సందీప్‌పై ఆదిలాబాద్, విజయవాడ, మహబూబ్‌నగర్, విశాఖపట్నం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో 30కి పైగా కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. మిగతా నిందితులపై కూడా పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితులను సోమవారం ఉదయం కర్నూలులోని యుకాన్ ప్లాజా సమీపంలో అరెస్ట్ చేసి, దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకుని న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



# స్కూళ్ల కుదింపుపై రేవంత్ సర్కార్‌కు కవిత ఘాటు విమర్శలు

**27 వేల పాఠశాలలను 4 వేలకే పరిమితం చేయడం దారుణమని ఆరోపణ**

**పేద, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటోందని వ్యాఖ్య**

**బాలికల విద్యపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన**

**గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై సమీక్ష చేయలేదని విమర్శ**

**సమీకృత పాఠశాలల ప్రతిపాదనపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ**

**హైదరాబాద్, జూన్ 8 (కొత్తస్వరం) :**

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల హేతుబద్ధీకరణ అంశం రాజకీయంగా వేడెక్కుతోంది. రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే కుదించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత కె. కవిత తీవ్ర స్థాయిలో స్పందించారు. సోమవారం విడుదల చేసిన వీడియో ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలోని వేలాది పాఠశాలలను కుదించడం అత్యంత దారుణమైన చర్యగా అభివర్ణించారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మరణాల ఘటనలపై ప్రభుత్వం సరైన సమీక్ష నిర్వహించలేదని ఆరోపించిన కవిత, విద్యాశాఖపై ప్రభుత్వానికి పట్టు లేకపోవడమే ఈ నిర్ణయాలకు కారణమని విమర్శించారు. ఇదిలా ఉండగా, బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన సమీకృత పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పాఠశాలల సమీకరణపై ఒకవైపు మద్దతు, మరోవైపు విమర్శలు వ్యక్తమవుతుండటంతో రాష్ట్ర విద్యా రంగంలో ఈ అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం నుంచి దీనిపై పూర్తి స్థాయి వివరణ రావాల్సి ఉంది.



# బిర్యానీలో చచ్చిన పురుగు

(మిగతా 2లో..)

ఆశ్రయించాడు. కేసును విచారించిన కమిషన్, అపరిశుభ్రమైన ఆహారాన్ని వడ్డించడం సేవల్లో లోపంగా పరిగణించింది. బాధితుడు సమర్పించిన వీడియో ఆధారాలను పరిశీలించి బిర్యానీలో పురుగు ఉన్నట్లు నిర్ధారించింది. విచారణకు రెస్టారెంట్ యాజమాన్యం హాజరుకాకపోవడంతో కమిషన్ ఏకపక్షంగా తీర్పు వెలువరించింది. దీంతో బాధితుడికి మానసిక వేదనకు గాను రూ.10,000, న్యాయపరమైన ఖర్చుల కింద మరో రూ.3,000 చెల్లించాలని ఆదేశించింది. అలాగే రాబోయే ఐదు వారాల పాటు ప్రతి ఆదివారం రెండు ప్లేట్ల చొప్పున మొత్తం 10 ప్లేట్ల నాణ్యమైన చికెన్ బిర్యానీని ఉచితంగా అందించాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ తీర్పు వినియోగదారుల హక్కుల పరిరక్షణలో కీలక మైలురాయిగా నిలిచిందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మరో రెండు మూడు రోజుల్లో తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు

**జూన్ 10-12 మధ్య రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం**

**అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో తుపాను ఆవర్తనాల ప్రభావం**

**రుతుపవనాల రాకతో రైతులకు ఊరట**

**11వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తార వర్షాల సూచన**

**ఈ ఏడాది దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం**



**హైదరాబాద్, జూన్ 8 (కొత్తస్వరం) :**

తీవ్రమైన ఎండలు, పొడి వాతావరణంతో ఇబ్బందులు పడుతున్న తెలంగాణ ప్రజలకు, రైతులకు వాతావరణ శాఖ శుభవార్త తెలిపింది. మరో రెండు మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ నెల 10 నుంచి 12 మధ్య రాష్ట్రాన్ని రుతుపవనాలు తాకే అవకాశముందని వెల్లడించారు. ఈశాన్య అరేబియా సముద్రం, ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన రెండు తుపాను ఆవర్తనాలు రుతుపవనాల పురోగతికి అనుకూల పరిస్థితులు కల్పిస్తున్నాయి. జూన్ 4న కేరళ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం వేగంగా ముందుకు సాగుతున్నాయి. అరేబియా సముద్రం నుంచి తేమతో కూడిన గాలులు ఈశాన్య దిశగా కదులుతుండగా, బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం గాలులను తనవైపు ఆకర్షిస్తోంది. ఈ రెండు వ్యవస్థల ప్రభావంతో మధ్య భారతదేశంపై మేఘాలు దట్టంగా కమ్ముకుని విస్తారంగా వర్షాలు కురిసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భారత వాతావరణ శాఖ (IMD) అంచనా ప్రకారం, జూన్ 11 నాటికి ఈ వ్యవస్థ మరింత బలపడి తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు నమోదవుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న రైతులకు నైరుతి రుతుపవనాల రాక ఎంతో ఊరటనివ్వనుంది. అయితే, ఈ ఏడాది El Niño ప్రభావం కారణంగా దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ స్థాయిలో, సుమారు 90 శాతం మేర మాత్రమే వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నీటి వనరుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

# ఆర్చ్‌బిషప్ మల్లవరపు ప్రకాష్ మృతిపై సీఎం చంద్రబాబు సంతాపం

**అమరావతి, జూన్ 8 (కొత్త స్వరం):**

విశాఖపట్నానికి చెందిన క్రైస్తవ మత బోధకులు, విశ్రాంత ఆర్చ్ బిషప్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. డాక్టర్ మల్లవరపు ప్రకాష్ సమాజానికి చేసిన సేవలు ఎనలేనివని సీఎం పేర్కొన్నారు. కడప, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో బిషప్‌గా సుదీర్ఘకాలం అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. మల్లవరపు ప్రకాష్ కుటుంబ సభ్యులు, క్రైస్తవ మత పెద్దలు, ఆయన అనుచరులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# పత్తికొండ టమాటా ప్రాసెసింగ్ యూనిట్ పనులు వేగవంతం చేయాలి

**మూడు నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం**

**రైతులకు విలువ ఆధారిత ప్రాసెసింగ్ సదుపాయాలు అందుబాటులోకి**

**టమాటా పంటకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడమే లక్ష్యం**

**శాఖల మధ్య సమన్వయంతో పనులు పూర్తి చేయాలని సూచన**

**నిర్మాణ పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**కర్నూలు, జూన్ 8 (కొత్తస్వరం) :**

పత్తికొండలో నిర్మాణంలో ఉన్న టమాటా ప్రాసెసింగ్ యూనిట్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు ప్రస్తుత స్థితి, మౌలిక వసతుల అభివృద్ధి, యంత్రాల ఏర్పాటు, నిర్మాణ పనుల వేగం, ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన చర్యలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టును వచ్చే మూడు నెలల్లో పూర్తిచేసి రైతులు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్), ఉద్యానవన శాఖ మరియు ఇతర అనుబంధ శాఖల అధికారులకు సూచించారు. టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం కావడం ద్వారా స్థానిక రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, పంటకు విలువ ఆధారిత ప్రాసెసింగ్ సదుపాయాలు అందుబాటులోకి రావడం వల్ల రైతుల ఆదాయం పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో ఏపీఎఫ్‌పీఎస్ మేనేజర్ శంకర్ నాయక్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ డా. శ్రీనివాసులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రామాంజినేయులు, ఏపీఎఫ్‌పీఎస్ అధికారి అజయ్ కుమార్, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.






## ప్రిన్సిపల్ సెక్రటరీకి పూలమొక్క అందజేసిన కలెక్టర్

కర్నూలు, జూన్ 8 (కొత్త స్వరం):

జిల్లా పర్యటనకు విచ్చేసిన ఎక్సైజ్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనాను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై స్వల్పంగా చర్చించారు. అధికారులు పాల్గొన్నారు.



# తిరుపతి ఎకనామిక్ రీజియన్‌తో రాయలసీమ సమగ్రాభివృద్ధికి బాటలు






### కర్నూలు జిల్లాలో పరిశ్రమలు, సోలార్ ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
### పశ్చిమ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల గుర్తింపునకు ఆదేశాలు
### ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై చర్చ
### పరిశ్రమలకు నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు తప్పనిసరి: ముఖేష్ కుమార్ మీనా
### కలెక్టరేట్‌లో అధికారులతో సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష

**కర్నూలు, జూన్ 08 (కొత్తస్వరం) :**

రాయలసీమ జిల్లాలు, నెల్లూరు జిల్లాను కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తిరుపతి ఎకనామిక్ రీజియన్ సమగ్ర అభివృద్ధికి కీలక వేదికగా నిలుస్తుందని ఎక్సైజ్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, తిరుపతి ఎకనామిక్ రీజియన్ శాఖల సీఈవో ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో తిరుపతి ఎకనామిక్ రీజియన్ ఏర్పాటులో భాగంగా జిల్లా సమగ్రాభివృద్ధి, భవిష్యత్ దార్శనికతపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమతుల అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేసిందన్నారు. తిరుపతి, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, కడప, నంద్యాల, కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాలను కలుపుతూ తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రతి ప్రాంతం ప్రత్యేకతలు, సహజ వనరులు, పరిశ్రమలకు అనుకూల పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తామని వెల్లడించారు. ఆర్థిక వృద్ధికి దోహదపడే రంగాలను గుర్తించి, వాటి ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. అలాగే అభివృద్ధి చోదకాలను పరస్పరం అనుసంధానించేలా సమర్థవంతమైన లాజిస్టిక్ నెట్‌వర్క్ అభివృద్ధి చేస్తామని, పట్టణాభివృద్ధి, రవాణా సౌకర్యాలు, మానవ వనరుల అభివృద్ధిని సమన్వయం చేస్తూ సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాలు సమగ్ర అభివృద్ధి సాధించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించిన ఆయన, పారిశ్రామిక ప్రాంతాలకు అనుబంధంగా భవిష్యత్ పట్టణాభివృద్ధి కోసం తగిన భూములను ముందుగానే గుర్తించి రిజర్వ్ చేయాలని సూచించారు. పరిశ్రమలతో పాటు నివాస, వాణిజ్య, మౌలిక వసతుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సమగ్ర అర్బన్ డెవలప్‌మెంట్ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఆదోని ప్రాంతంలో పరిశ్రమలు, సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను గుర్తించాలని సూచించిన ఆయన, పరిశ్రమలకు అవసరమైన నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఓర్వకల్లు నోడ్‌లో పరిశ్రమల స్థాపన, డ్రోన్ సిటీ ఏర్పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఎంఎస్ఎంఈల అభివృద్ధి, నీటి పారుదల ప్రాజెక్టులు, పరిశ్రమలకు నీటి సరఫరా తదితర అంశాలపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అధికారులతో ఆయన విస్తృతంగా చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు, నీటి వనరులు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి తదితర అంశాలను ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ఇండస్ట్రీస్ జీఎం అశోక్ కుమార్, ఏపీఐఐసీ అధికారి సందీప్, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, సీపీఓ భారతి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ప్రదీప్, డీడీ మైన్స్ నాగిని తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 123 ఫిర్యాదులు

### ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడిన జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్
### చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా
### నిర్ణీత గడువులో ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు
### పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచన

**నంద్యాల, జూన్ 8 (కొత్తస్వరం) :**

నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం - PGRS) కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 123 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఐపీఎస్ స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను వివరంగా తెలుసుకున్న ఎస్పీ, ప్రతి ఫిర్యాదుపై పూర్తిస్థాయి విచారణ జరిపి చట్టపరమైన పరిధిలో పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, చట్టపరంగా పరిష్కరించగల అంశాలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోపు ఫిర్యాదులను పరిష్కరించి, వాటి పురోగతిపై సంబంధిత వివరాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి నివేదించాలని సూచించారు. అదేవిధంగా ఒకే సమస్యపై ఫిర్యాదులు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేస్తామని ఎస్పీ పేర్కొన్నారు.




# మత్తు మాదక ద్రవ్యాలు దేశ భవిష్యత్తుకు పెనుముప్పు

### డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యువతకు వన్‌టౌన్ సీఐ మారుతి శంకర్ పిలుపు

**దేశాన్ని ప్రేమించేవారు డ్రగ్స్ ముట్టరని అవగాహన**

**గ్రంథాలయాలు జీవితాలను మార్చే జ్ఞాన మందిరాలని వ్యాఖ్య**

**నార్కో టెర్రరిజంపై విద్యార్థులకు వివరణ**

**డ్రగ్స్ సమాచారానికి ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972**

**పుస్తక పఠనం, క్రీడలతో మంచి భవిష్యత్తు సాధించాలని సూచన**




**కర్నూలు, జూన్ 8 (కొత్తస్వరం) :**

మత్తు మాదక ద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, డ్రగ్స్ సమాజానికి, దేశానికి పెనుముప్పుగా మారాయని కర్నూలు వన్‌టౌన్ సీఐ మారుతి శంకర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని గ్రంథాలయానికి వచ్చిన పుస్తక ప్రియులు, విద్యార్థులకు డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని ప్రేమించేవారు డ్రగ్స్‌కు దూరంగా ఉంటారని అన్నారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోనే కాకుండా ఉద్యోగులు, సాధారణ ప్రజలు కూడా డ్రగ్స్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ కొనుగోలుకు వెచ్చించే డబ్బు ఉగ్రవాదులు, నక్సలైట్లకు చేరి ఆయుధాల కొనుగోలుకు ఉపయోగపడుతుందని, దీనినే నార్కో టెర్రరిజం అంటారని వివరించారు. గ్రంథాలయం సాధారణ స్థలం కాదని, జీవితాలను మార్చే జ్ఞాన మందిరమని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, మహాత్మా గాంధీ వంటి మహనీయులు గ్రంథాలయాల్లో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ ఎలీషా మాట్లాడుతూ.. యువత గ్రంథాలయాలు, క్రీడల వైపు మొగ్గు చూపి డ్రగ్స్‌ను తరిమికొట్టాలని సూచించారు. ఒత్తిడి సమయాల్లో మత్తు పదార్థాల వైపు కాకుండా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని కోరారు. ఎన్‌డీపీఎస్ చట్టం-1985పై అవగాహన కల్పించిన అధికారులు, ఈగల్ టీం చేపడుతున్న చర్యలను వివరించారు. ఇటీవల రాష్ట్రంలోని పలు పట్టణాల్లో చదువుకున్న యువకులు డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కొని జీవితాలను నాశనం చేసుకున్న ఘటనలను ప్రస్తావిస్తూ, యువత తమ భవిష్యత్తును బంగారు బాటలో నడిపించాలని సూచించారు. డ్రగ్స్ ఫ్యాషన్‌గా ప్రారంభమై బానిసత్వానికి దారి తీస్తుందని, చివరకు ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని, జీవితాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రమేష్, మాసూం వలి, గ్రంథాలయ కార్యదర్శి ప్రకాష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐఐటీ, జేఈఈ, నీట్ పేర్లతో విద్యా వ్యాపారం చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

**అక్రమ ఫీజుల వసూళ్లపై పీడీఎస్‌యూ ఆందోళన**




**కర్నూలు, జూన్ 8 (కొత్తస్వరం) :**

కర్నూలు జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్ పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, అలాంటి కళాశాలల గుర్తింపులను వెంటనే రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎండి రఫీ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌కు పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎండి రఫీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అనేక కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు పుస్తకాల పేరుతో వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు. ఎంసెట్, నీట్, జేఈఈ వంటి ప్రవేశ పరీక్షలకు అవసరమైన అనుమతులు లేకపోయినా, ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్ కోచింగ్ పేరుతో విద్యార్థులను ఆకర్షిస్తూ మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. అక్షరాలను వ్యాపారంగా మార్చి లక్షల రూపాయలు సంపాదిస్తున్న కార్పొరేట్ కళాశాలల్లో కనీస సౌకర్యాలు కూడా సరిగా లేవని ఆరోపించారు. ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలను గుర్తించి, వాటి గుర్తింపులను రద్దు చేయాలని విద్యాశాఖ అధికారులను కోరారు. ఒకే బ్రాంచ్‌కు అనుమతి తీసుకుని రెండు బ్రాంచ్‌లు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి సోమశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు షాహీద్, జిల్లా నాయకులు మద్రిస్వామి, ఉరుకుందు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజా ప్రభుత్వానికి రెండేళ్లు' కార్యక్రమం ఘనంగా నిర్వహణ

**నంద్యాలలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై సమీక్ష**

**అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య**

**పాల్గొన్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి**

**మంత్రులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకుల హాజరు**



**నంద్యాల, జూన్ 8 (కొత్తస్వరం) :**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నంద్యాల పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో 'ప్రజా ప్రభుత్వానికి రెండేళ్లు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్, పాణ్యం ఎమ్మెల్యే, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గౌరు చరితరెడ్డితో కలిసి నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని చేపట్టిన పలు కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజా సేవా కార్యక్రమాలను వివరించారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తున్నాయని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ ఫరూఖ్, నంద్యాల జిల్లా ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




**పాత్రికేయులు కావలెను**

కొత్తస్వరం దినపత్రికకు అనుభవం కలిగిన, వార్తా కథనాలు (స్టోరీలు) రాయగలిగే పాత్రికేయ మిత్రులు కావలెను.

నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలకు రిపోర్టర్లు అవసరం

నందికొట్కూరు - నందికొట్కూరు రూరల్ - పగిడ్యాల - జూపాడుబంగ్లా - కొత్తపల్లె - పాములపాడు - మిడుతూరు

కొత్తస్వరం 9492813364



## రాక్ గార్డెన్‌లో యోగాంధ్ర కార్యక్రమం

కర్నూలు, జూన్ 8 (కొత్త స్వరం):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఓర్వకల్లు మండలంలోని రాక్ గార్డెన్‌లో నిర్వహించిన పర్యాటక యోగ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, యోగాభ్యాసకులు పాల్గొని యోగా సాధన చేశారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

# అర్జీలను గడువులోపు నాణ్యతతో పరిష్కరించాలి

అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన కలెక్టర్

వికలాంగులు, వృద్ధుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్

ఫిర్యాదులన్నీ అదే రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశం

నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యల హెచ్చరిక

పెండింగ్ లేకుండా అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**కర్నూలు, జూన్ 8 (కొత్తస్వరం) :**

ప్రజల నుంచి అందిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు నాణ్యతతో పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆమె జాయింట్ కలెక్టర్‌తో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వికలాంగులు, వృద్ధులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అందిన అర్జీలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రీవెన్స్ స్వీకరణ ప్రక్రియ పూర్తయిన వెంటనే అన్ని ఫిర్యాదులను అదే రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్‌వోడీలు అర్జీదారులకు స్వయంగా ఫోన్ చేసి సమస్య పరిష్కారంపై సమాచారం ఇవ్వాలని, పరిష్కారం సాధ్యం కాకపోతే కారణాలను వివరించాలని సూచించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో పరిష్కరించిన అర్జీలను పెండింగ్ లేకుండా ఆడిట్ చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని సమస్యల పరిష్కారం మరింత నాణ్యంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఏ ఒక్క అర్జీ కూడా నిర్దేశిత గడువు (ఎస్ఎల్ఏ) దాటకూడదని, రీ–ఓపెన్ అయ్యే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. అధికారులు అర్జీదారులతో మర్యాదగా, సహానుభూతితో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఆహార భద్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం





**కర్నూలు, జూన్ 08 (కొత్తస్వరం) :**

ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జి. కబర్ధి, కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి సూచనలతో న్యాయ సేవాధికార సంస్థ సమావేశ భవనంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ మాట్లాడుతూ ఆహారం సురక్షితంగా ఉండటం ప్రతి మనిషి ఆరోగ్యానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. కలుషిత ఆహారం అనేక రకాల వ్యాధులకు కారణమవుతుందని, ఆహార తయారీ, నిల్వ, రవాణా, విక్రయాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతి వ్యక్తి ఆహార భద్రతా ప్రమాణాలపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శివరామకృష్ణ రావు మాట్లాడుతూ పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు సురక్షితమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణలో ఆహార భద్రత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్ మాట్లాడుతూ గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగించరాదని హెచ్చరించారు. పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి ఉపయోగించాలని, తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆహార వ్యర్థాలను తగ్గించడం కూడా ఆహార భద్రతలో భాగమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో ఆహార భద్రతపై అవగాహన కల్పించాలని, ఆహార భద్రత ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని వక్తలు అభిప్రాయపడ్డారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆహార నాణ్యతను నిర్ధారించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవ ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్యానల్ అడ్వకేట్లు, పారా లీగల్ వాలంటీర్లు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాత్రివేళల్లో విజిబుల్ పోలీసింగ్ ముమ్మరం

**రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్ - వాష్ అండ్ గో' కార్యక్రమం**

**జాతీయ రహదారులపై డ్రైవర్లకు విశ్రాంతి కల్పిస్తున్న పోలీసులు**

**అలసటతో డ్రైవింగ్ చేయొద్దని అవగాహన**

**నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలకు హెచ్చరిక**

**కర్నూలు, జూన్ 8 (కొత్తస్వరం) :**

రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా కర్నూలు జిల్లా పోలీసులు రాత్రివేళల్లో విజిబుల్ పోలీసింగ్‌ను ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, రద్దీ ప్రాంతాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కొనసాగుతున్న ఈ తనిఖీల్లో లారీలు, బస్సులు మరియు ఇతర వాహనాలను నిలిపి డ్రైవర్లకు విశ్రాంతి కల్పిస్తున్నారు. అలసటతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉండటంతో 'స్టాప్ – వాష్ అండ్ గో' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లు కొంతసేపు విశ్రాంతి తీసుకునేలా చేసి, నీటితో ముఖం కడుక్కొని అప్రమత్తంగా ప్రయాణం కొనసాగించేలా సూచనలు చేస్తున్నారు. రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నారు. అలాగే అతివేగంగా వాహనాలు నడపడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం, అధిక ప్రయాణికులతో వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ఇలాంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు.



# ఎరువుల పంపిణీలో.. పారదర్శకతకు పెద్దపీట

కర్నూలు జిల్లాలో ఎరువుల పంపిణీ ప్రక్రియను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి





ఆధార్ ఆధారిత బుకింగ్ విధానంతో రైతులకు సులభతరం

APAIMS యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు నిర్వహించాలని ఆదేశం

యూరియా, డీఏపీ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వెల్లడి

రైతులకు కొరత లేకుండా ఎరువుల సరఫరాపై ప్రత్యేక దృష్టి

రైతు సేవా కేంద్రాలు, డీలర్ల పనితీరును తనిఖీ చేసిన అధికారులు

**కర్నూలు, జూన్ 08 (కొత్తస్వరం) :**

కర్నూలు జిల్లాలో రైతులకు ఎరువుల పంపిణీ సక్రమంగా జరుగుతోందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి పి.ఎల్. వరలక్ష్మి తెలిపారు. సోమవారం కర్నూలు మండలంలోని మానా గ్రోమోర్ సెంటర్, శివ రామకృష్ణ ఫెర్టిలైజర్స్, కల్లూరు మండలంలోని లక్ష్మీపురం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన ఆమె ఎరువుల నిల్వలు, విక్రయాల నమోదు, రైతుల బుకింగ్ ప్రక్రియ, APAIMS యాప్ అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధార్ ఆధారిత ఎరువుల బుకింగ్ విధానం ద్వారా ఎరువుల పంపిణీలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం తీసుకువచ్చినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, సహకార సంఘాల (PACS) సిబ్బంది, లైసెన్స్ పొందిన రిటైల్ డీలర్లు రైతుల భూ వివరాలను ధృవీకరించి APAIMS పోర్టల్‌లో నమోదు చేస్తున్నారని చెప్పారు. రైతులు తమ ఆధార్ నంబర్ ద్వారా ధృవీకరణ పూర్తి చేసుకుని అవసరమైన ఎరువులను ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. అలాగే తమకు అనుకూలమైన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఎంపిక చేసుకుని అక్కడ నుంచే ఎరువులు పొందవచ్చని వివరించారు. అన్ని రిటైల్ ఎరువుల డీలర్లు, విక్రయ కేంద్రాలు తప్పనిసరిగా APAIMS యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. రైతుల ఆధార్ ధృవీకరణ అనంతరం OTP ఆధారంగా మాత్రమే విక్రయాలు చేపట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మాన్యువల్ విక్రయాలు చేయరాదని స్పష్టం చేశారు. రైతులకు ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రిటైల్ డీలర్లు, PACS సిబ్బంది, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, విక్రయాల నమోదు పత్రాలు, APAIMS పోర్టల్‌లో నమోదైన వివరాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ఆమె, జిల్లాలో యూరియా, డీఏపీతో పాటు ఇతర రసాయన ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. ఎరువుల కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, PACS ప్రతినిధులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.



## 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమం నిర్వహించిన వైఎస్సార్సీపీ

**ఎన్నికల హామీలు అమలు కాలేదని కూటమి ప్రభుత్వంపై విమర్శలు**

**'ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఇప్పటికీ అమలు కాలేదు'**

**బ్లాక్ బెలూన్లు ఎగరవేసి నిరసన తెలిపిన పార్టీ నేతలు**

**ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని డా. సుదీర్ దారా వెల్లడి**

**నందికొట్కూరు, జూన్ 8 (కొత్తస్వరం) :**

నందికొట్కూరు వైఎస్సార్సీపీ కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త డా. సుదీర్ దారా ఆధ్వర్యంలో 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని పార్టీ నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, రైతుల సమస్యలు, యూరియా కొరత, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, బీమా సౌకర్యాల లోపం తదితర అంశాలను ప్రస్తావిస్తూ చంద్రబాబు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. విజువలైజేషన్ ప్రదర్శనల ద్వారా పార్టీ నేతలు, కార్యకర్తలకు ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా డా. సుదీర్ దారా మాట్లాడుతూ టీడీపీని "త్రీ ఇన్ వన్ పార్టీ"గా అభివర్ణించారు. మోదీ, పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలిసి నడిపించే పార్టీగా వ్యాఖ్యానించారు. టీడీపీని స్థాపించింది ఎన్టీఆర్ అని, చంద్రబాబు ఆ పార్టీని స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, కొత్త పింఛన్లు వంటి కీలక హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, దీంతో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ఎన్నికల హామీల అమలు కోసం వైఎస్సార్సీపీ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం చంద్రబాబు ప్రభుత్వ విధానాలకు నిరసనగా పార్టీ కార్యాలయం వద్ద బ్లాక్ బెలూన్లు ఎగరవేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వ విధానాలతో దేశం ఆర్థిక సంక్షోభంలోకి

ప్రజలు, విద్యార్థులు, యువత పోరాటాలకు సిద్ధం కావాలి: ఎంసీపీఐ(యూ) పిలుపు

**జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎంసీపీఐ(యూ) నేతలు**

**పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో ప్రజలపై భారాలు**

**నీట్ నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శ**

**విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**

**కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపు**

**కర్నూలు, జూన్ 8 (కొత్తస్వరం) :**

ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరికి వినతిపత్రం అందజేసినట్లు పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా నిర్మాణ బాధ్యులు ఉదయ్, దక్క కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ దేశాన్ని ఆర్థిక సంక్షోభం వైపు నెడుతోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వరుసగా పెంచుతూ ప్రజలపై అధిక ఆర్థిక భారాలు మోపుతున్నారని విమర్శించారు. అంతర్జాతీయ పరిస్థితులు, సామ్రాజ్యవాద దేశాల యుద్ధాల ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు. నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీని కారణంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలు కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గట్టిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత, మహిళలు, వామపక్ష ప్రజా సంఘాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎంసీపీఐ(యూ) నాయకులు పిలుపునిచ్చారు.




Edited, Printed, Published by **KEDEM RAVI RAJU,** Printed at 3-151, DAMAGATLA NANDIKOTKURU, KURNOOL, ANDHRA PRADESH - 518432, **VSAR PUBLICATIONS,** 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006, A.P., Editor : **KEDEM RAVI RAJU**, Cell No. 9912213364, Email:kothaswaram2024@gmail.com, **PRGI No. APTEL/2010/31893**, WebSite : www.kothaswaram.com

# సంక్షేమ రాజ్య నిర్మాణమే లక్ష్యం: భట్టి విక్రమార్క

## రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ – రూ.25 కోట్లతో ఎస్సీ హాస్టల్ ఆధునికీకరణ

## ఉద్యోగార్థులకు ఉచిత డిజిటల్ కోచింగ్ అందిస్తాం

**హైదరాబాద్, జూన్ 8 (కొత్త స్వరం):**
తెలంగాణలో సంక్షేమ రాజ్య నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి Bhatti Vikramarka స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించనున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, కాచిగూడ నింబోలి అడ్డా వద్ద నిర్మించనున్న ఎస్సీ హాస్టల్ స్థలాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రూ.110 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే రూ.25 కోట్లతో నింబోలి అడ్డా హాస్టల్‌ను ఆధునికీకరించి, దానికి "బాబు జగ్జీవన్ రామ్ నాలెడ్జ్ సెంటర్"గా పేరు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రాలు కేవలం భవనాలు మాత్రమే కాకుండా వేలాది మంది విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే ఆధునిక విద్యా కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసి, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా నాణ్యమైన కోచింగ్ అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్‌లోని ప్రధాన కేంద్రం నుంచి నిపుణులైన అధ్యాపకులు బోధించే పాఠాలను డిజిటల్ వ్యవస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నాలెడ్జ్ సెంటర్లకు అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. దీంతో నిరుద్యోగ యువత కోచింగ్ కోసం హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం ఉండదన్నారు. నాలెడ్జ్ సెంటర్‌లో డిజిటల్ లైబ్రరీలు, స్టడీ సర్కిల్స్, ఆధునిక కాన్ఫరెన్స్ హాళ్లు, ఆన్‌లైన్ లెర్నింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయడమే కాకుండా, వాటిని సాధించేందుకు అవసరమైన ఉచిత కోచింగ్‌ను కూడా ప్రభుత్వం అందించనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ మంత్రి Adluri Laxman Kumar, రాజ్యసభ సభ్యుడు Anil Kumar Yadav, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలోకి ప్రవేశించిన నైరుతి

**జోగులాంబ గద్వాల జిల్లాను తాకినట్లు వెల్లడి**

**హైదరాబాద్, జూన్ 8 (కొత్తస్వరం):**
తెలంగాణ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రాన్ని తాకాయి. తాజాగా వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. రుతుపవనాలు జోగులాంబ గద్వాల జిల్లా ద్వారా తెలంగాణలోకి అధికారికంగా ప్రవేశించాయి. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వాతావరణం చల్లబడటమే కాకుండా, రాబోయే రెండు మూడు రోజుల్లో ఇవి మరింత బలోపేతం కానున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణ అంతటా రుతుపవనాలు పూర్తిగా విస్తరిస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రుతుపవనాల రాకతో ముఖ్యంగా దక్షిణ , తూర్పు తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ భారీ వర్ష సూచన జారీ చేసింది. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు, అలాగే సాగు పనులకు సిద్ధమవుతున్న రైతులకు ఈ రుతుపవనాల ప్రవేశం ఎంతో ఉపశమనాన్ని , సంతోషాన్ని కలిగిస్తోంది.

# గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం: సర్పంచ్ అనూష బాయి



## ప్రజా పాలన గ్రామసభలో గ్రామాభివృద్ధిపై హామీ

## తాగునీరు, రహదారులు, విద్యుత్ సదుపాయాలకు ప్రాధాన్యం

## అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలు

## ప్రజల సహకారంతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

## గ్రామసభలో సమస్యలు, అవసరాలు వివరించిన ప్రజలు

**బషీరాబాద్, జూన్ 8 (కొత్తస్వరం) :**
గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉన్నామని మంతన్ గౌడ్ తాండ గ్రామ సర్పంచ్ అనూష బాయి అన్నారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని మంతన్ గౌడ్ తాండలో సోమవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనూష బాయి మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో తాగునీరు, పరిశుభ్రమైన రహదారులు, విద్యుత్, విద్య వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని ఆమె అన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామసభలో పాల్గొన్న ప్రజలు తమ సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గోపాల్, ఉపసర్పంచ్ లక్ష్మి బాయి, కానిస్టేబుల్ నర్సింలు, వార్డు సభ్యులు, గ్రామ మహిళలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**సర్పంచ్ శరణమ్మ శ్రీనివాస్**
**ప్రజాపాలన గ్రామసభలో గ్రామాభివృద్ధిపై దృష్టి**
**మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత**
**తాగునీరు, పరిశుభ్రత, రహదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు**
**ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాల అమలు**
**కొర్విచేడ్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ**

**బషీరాబాద్, జూన్ 8 (కొత్తస్వరం) :**
ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని కొర్విచేడ్ (గని) గ్రామ సర్పంచ్ వడ్డే శరణమ్మ శ్రీనివాస్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆమె పాల్గొని గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. తాగునీరు, పరిశుభ్రత, అంతర్గత రహదారులు, వీధి దీపాలు తదితర సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో కొర్విచేడ్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సర్పంచ్ శరణమ్మ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, గ్రామ కార్యదర్శి, ఏఈ జస్వంత్ కుమార్, మాజీ ఎంపీటీసీ ఉలగప్ప, కానిస్టేబుల్ అశోక్, వార్డు సభ్యులు, గ్రామ యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో గ్రామ కార్యదర్శిపై ఫిర్యాదు

**బదిలీ ఉత్తర్వులు అమలు చేయడం లేదని సర్పంచ్ ఆవేదన**
**గ్రామ పరిపాలనకు ఆటంకాలు ఎదురవుతున్నాయని ఆరోపణ**
**ఫిర్యాదును సంబంధిత అధికారులకు పంపించినట్లు వెల్లడి**
**విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని హామీ**
**ప్రజావాణిలో ఒక ఫిర్యాదు స్వీకరించిన అధికారులు**

**బషీరాబాద్, జూన్ 8 (కొత్తస్వరం) :**
వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఒక ఫిర్యాదు అందినట్లు సూపరింటెండెంట్ విజయ్ కుమారి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం, చిన్నగొట్టిగ ఖుర్దు గ్రామపంచాయతీ కార్యదర్శికి అల్లాపూర్ గ్రామపంచాయతీకి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే బదిలీ జరిగినప్పటికీ సంబంధిత కార్యదర్శి అల్లాపూర్ గ్రామంలో విధుల్లో చేరలేదని చిన్నగొట్టిగ ఖుర్దు గ్రామ సర్పంచ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బదిలీ ఉత్తర్వులను అమలు చేయకుండా కార్యదర్శి వ్యవహరిస్తుండడంతో గ్రామ పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదును సంబంధిత అధికారులకు పంపించి విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని సూపరింటెండెంట్ విజయ్ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ యశ్వంత్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటయ్య, అంగన్‌వాడీ సూపర్వైజర్ జ్యోతి, ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ చెన్నయ్య, రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్ కృష్ణ, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# తాపీ మేస్త్రీల ఆత్మగౌరవ సభకు భారీగా తరలిన కార్మికులు





**ఇందిరా పార్క్ సభకు జవహర్‌నగర్ నుంచి బస్సుల్లో బయలుదేరిన కార్మికులు**
**భవన నిర్మాణ రంగ కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యం**
**గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ**
**సంఘ నాయకుల పిలుపుతో భారీ స్పందన**

**జవహర్‌నగర్, జూన్ 8 (కొత్తస్వరం ప్రతినిధి):**
భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న తాపీ మేస్త్రీల ఆత్మగౌరవ సభకు జవహర్‌నగర్ భవన నిర్మాణ సంఘం, కాంట్రాక్టర్స్ కార్మికులు అధిక సంఖ్యలో బస్సులపై బయలుదేరారు. కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణ, సంక్షేమ అంశాలను ప్రధానంగా ప్రస్తావించేందుకు నిర్వహిస్తున్న ఈ సభకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరవుతున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు కొయ్యడా వెంకటేష్, చెన్నాపురం యాదయ్య, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, ఉపాధ్యక్షులు మరాఠి బాబు, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు ఎర్రెల్లి మల్లేష్, కోశాధికారి కోట్ల చెన్నారెడ్డి, సలహాదారులు రమణరెడ్డి, కొయ్యడా ఐలయ్య, మాధవ్, సాదుల్ల మధు కుర్మ, వెంకటేష్, యాదగిరి, మహేష్, శ్రీను తదితరులతో పాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# కాప్రా నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు

**మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపిన విఠల్ నాయక్**
**పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు**
**కాంగ్రెస్ నాయకుల పాల్గొనిక**
**పరిపాలనా బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్ష**
**కాప్రాలో మర్యాదపూర్వక భేటీ**



**కాప్రా, జూన్ 8 (కొత్తస్వరం ప్రతినిధి):**
కాప్రా మండల నూతన తహసీల్దార్‌ను మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. పరిపాలనా వ్యవహారాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ నాయుడు, ప్రవీణ్, రామ్‌రెడ్డి, సోమయ్య తదితరులు పాల్గొని నూతన తహసీల్దార్‌కు అభినందనలు తెలియజేశారు.

# టూరిజంకు కొత్త రూట్ మ్యాప్

**హైదరాబాద్, జూన్ 8 (కొత్త స్వరం):**
తెలంగాణ పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కొత్త రూట్ మ్యాప్ సిద్ధం చేసిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలి దశలో ఎనిమిది ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి ప్రపంచ స్థాయి గమ్యస్థానాలుగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. ప్రతి ప్రాంతానికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రకృతి, చరిత్ర, సంస్కృతి సమ్మేళనంగా ఉండే 'స్లో టూరిజం'కు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. వికారాబాద్, రామప్ప దేవాలయం, యాదాద్రి, భద్రాచలం ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. భువనగిరిని దేశంలోనే ప్రముఖ హెరిటేజ్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. స్కైవాక్‌లు, వ్యూ డెక్స్, అడ్వెంచర్ యాక్టివిటీలతో పాటు సోమశిలలో క్రూయిజ్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పర్యాటక రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కార్యాచరణ ప్రారంభించినట్లు వెల్లడించారు.

# బీజేపీకి వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాలి

**కూటమి పార్టీలకు రాహుల్ గాంధీ పిలుపు**

**న్యూఢిల్లీ, జూన్ 8 (కొత్త స్వరం):**
ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బీజేపీని ఎదుర్కోవాలంటే ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా ఉండాలని, అంతర్గత విభేదాలకు తావివ్వకుండా కలిసి పని చేయాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత Rahul Gandhi పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన 'ఇండియా' కూటమి సమావేశంలో ఆయన మాట్లాడారు. "కలిసికట్టుగా ఉంటేనే నిలబడతాం, విడిపోతే పడిపోతాం" అని పేర్కొంటూ, దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు అన్ని భాగస్వామ్య పార్టీలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కూటమిలోని కొన్ని పార్టీలు కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం, కీలక అంశాల్లో సమన్వయం లోపించడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గత లోక్‌సభ ఎన్నికలను ప్రస్తావిస్తూ, బీజేపీని ఓడించడం అసాధ్యం కాదని, కానీ ప్రతిపక్షాల అంతర్గత కుమ్ములాటల వల్లే బలహీనత ఏర్పడుతోందని అన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఐక్యత వల్ల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లును అడ్డుకోగలిగామని గుర్తుచేశారు. ఇండియా కూటమి సమావేశంలో ఇకపై ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. తదుపరి సమావేశాన్ని ఆగస్టులో Hyderabadలో నిర్వహిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు Mallikarjun Kharge ప్రకటించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను కూడా సమావేశంలో చర్చించారు. భవిష్యత్ రాజకీయ వ్యూహాలు, ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటానికి కార్యాచరణ రూపొందించేందుకు కూటమి పార్టీలు అంగీకరించాయి.

# ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

**స్టీరింగ్ రాడ్ విరిగి పంటపొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు**

**విజయవాడ, జూన్ 8 (కొత్తస్వరం) :**
కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. అయితే బస్సులో ప్రయాణిస్తున్న 20మంది ప్రయాణికులు చిన్న గాయాలతో బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గన్నవరం డిపోకు చెందిన 220 నంబర్ ఆర్టీసీ బస్సు తెన్నేరు నుంచి గన్నవరం వైపు వెళ్తుండగా, తెన్నేరు?మంతెన మధ్య మార్గంలో ఒక్కసారిగా స్టీరింగ్ రాడ్ విరిగిపోయింది. దీంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టి బస్సులో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 20 మంది ప్రయాణికులు ఉండగా ముగ్గురికి గాయాలు అయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం కంకిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.